క్లుప్తంగా

కాంగ్రెస్‌లోకి కమతం శ్రీనివాస్‌రెడ్డి

మహమ్మదాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, ప్రస్తుత గండేడ్ పీఏసీఎస్ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. మాజీ మంత్రి కమతం రాంరెడ్డి కుమారుడైన ఆయన గురువారం గాంధీభవన్‌లో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మండల నాయకుల ఎంపికపై హర్షం

నవాబుపేట: కాంగ్రెస్ స్పోక్ పర్సన్స్‌గా మండలానికి చెందిన ఇద్దరు నాయకులను పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గురువారం ప్రగటించారు. యన్మన్‌గండ్లకి చెందిన జహీర్ అక్తర్, పోమాల్‌కి చెందిన ధారా భాస్కర్‌లను ట్రెనింగ్ క్యాంప్‌లో పర్సన్‌లుగా ఎంపిక చేసినట్లు వివరించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

గండేడ్: ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరు గాయపడ్డ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొంరెడ్డిపల్లికి చెందిన రాములు తన వాహనంపై గండేడ్‌కు వెళ్తున్న సమయంలో కొడంగల్‌కు చెందిన మోహన్ బైక్‌పై మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొంరెడ్డిపల్లి సమీపంలో కల్వర్టు పనులు సాగుతున్న చోట వన్ వేలో వారి వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఘటనలో రాములు కాలికి గాయం అయ్యింది. మోహన్‌కు సైతం గాయపడ్డాడు. స్థానికులు 108 సమాచారం ఇవ్వడంతో అంబులెన్సులో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో చోరీ

హన్వాడ: మండల పరిధిలోని కొత్తపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇన్వెర్టర్ బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించిన ఘటన గురువారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. ఉన్నత పాఠశాలలో విద్యుత్ ను సరఫరా చేసే ఆరు బ్యాటరీలను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించుకెళ్లారు. ఉదయం ఎప్పటిలా పాఠశాలకు వచ్చి చూసిన ఉపాధ్యాయులు చోరీ జరిగిందని గుర్తించారు. విషయంపై ఎస్ఎంసీ చైర్మన్ హన్మంతుకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు హన్వాడ పోలీసులకు తెలుపగా ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఎస్ఎంసీ చైర్మన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవినాయక్ పేర్కొన్నారు.

పాలు పంపొద్దంటే ఎలా?

రాజాపూర్: పాడిని నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్న తమను పాలు పోయొద్దని విజయడైరీ వారు గ్రామాల్లోని పాలమిత్రలకు చెబుతున్నారని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి, ఖానాపూర్ తదిత గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా పాడిని నమ్ముకుని రూ.వేలు అప్పులు చేసి గేదెలు, ఆవులను కొనుగోలు చేశామని గురువారం వాపోయారు. తీరా పాలు పంపవద్దని చెప్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

చెన్నకేశవుడి సన్నిధిలో కేంద్ర సహాయ మంత్రి

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామిని కేంద్రసహాయ మంత్రి భగవత్‌కూబ గురువారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులతో కలసి ఆయన ఆలయానికి చేరుకోగా పూజారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రమాదకరంగా మలుపు



అడ్డాకుల: మండలంలోని వర్నె నుంచి ముత్యాలంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రమాదకర మలుపు తిరిగి ఉంది. ఇక్కడ గతంలో ఓ భారీ లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న పాఠశాల ప్రహరీపై పడిపోయింది. అదృష్టవశాత్తు పక్కన విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇదిలా ఉండగా ఈ మలుపు వద్ద ఆటోలు, ద్విచక్రవాహనాలు అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలు లేకపోలేదు. అధికారులు స్పందించి తగిన రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

చక్రాపూర్‌లో ప్రచారం

అడ్డాకుల: చక్రాపూర్ గ్రామంలో గురువారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఉప్పరి బ్రహ్మయ్య, అంజనేయులు, రమేష్, రాజు, నర్సిములు తదితరులు ఉన్నారు.



రామచంద్రాపూర్‌లో..



కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో..



బోయపల్లిలో..

పూసిన చెట్టువమ్మా.. పూల గట్టువమ్మా

- పాఠశాలల్లో అట్టహాసంగా బతుకమ్మ వేడుకలు

సాక్షినెట్ వర్క్ : జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లోని పాఠశాలల్లో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు.

జడ్చర్ల పరిధిలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో సంబరాలు నిర్వహించారు. శుక్రవారం నుంచి విద్యాసంస్థలకు దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ముందుగానే బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు.

రామచంద్రాపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బాలవీర్, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రెడ్డి, నాగ్‌నాథ్, అనురాధ, పద్మ, విజయ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేటలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

గండేడ్ మండల పరిధిలోని పలు పాఠశాలల్లో బతుకమ్మ ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. వెన్నాచేడ్, గండేడ్, కప్లాపూర్, బల్సూర్‌గొండ, పగిడ్యాల్, చిన్నవార్వాల్, జిన్నారం, సల్కర్‌పేట్ తదితర గ్రామాల్లో సంబురాలు జరిగాయి.

చిన్నచింతకుంట మండలంలోని బండ్రపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేశారు. విద్యార్థులు కోలాటాలు వేసి బతుకమ్మలు ఆడారు. అనంతరం గ్రామ సమీపంలోని ఊకచెట్టువాగులో నిమజ్జనం చేశారు. అంతకు ముందు పాఠశాలలో విద్యార్థులు జాతీయ జండా, రాకెట్ ప్రదర్శనలను చేశారు.



నవాబుపేటలో బతుకమ్మలు

నవాబుపేటలో దసరా పండగ సెలవులు రావటంతో గురువారం రోజే వివిధ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు, పోమాల్ తదితర గ్రామాల్లో వేడుకలు జరిగాయి.



బండ్రపల్లిలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు



లింగంపేట ప్రాథమిక పాఠశాలలో..



బతుకమ్మలతో వెన్నాచేడ్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఓటు విలువ తెలుసుకోవాలి

జడ్చర్ల టౌన్: ఓటు ఎంతో విలువైనదని దానిని సక్రమంగా వినియోగించుకోవాలని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి పొద్దుపోయాక కిష్టంపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఓటు ప్రాధాన్యత గూర్చి అవగాహన కల్పించారు. సమాజంలో యువకుల పాత్ర ఎంతో కీలకమని, సరైన మార్గంలో యువత పయనించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి యువత నడుం బిగించాలన్నారు. ముఖ్యంగా విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని తద్వారా సమాజంలో ఆశించిన మార్పు వస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరకద్ర: కౌకుంట్ల, దేవరకద్ర మండలాల పరిధిలో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ సత్యయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 220 కేవీ విద్యుత్ ఉప కేంద్రం, 132 కేవీ మరికల్ విద్యుత్ ఉప కేంద్రాలలో మరమ్మతు కారణంగా సరఫరా ఉండదని వివరించారు.

అంబులెన్సులో ప్రసవం.. తల్లీబిడ్డా క్షేమం

మహమ్మదాబాద్: అంబులెన్సులో ఓ మహిళ ప్రసవించిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నాయిపల్లికి చెందిన మమత గురువారం సాయంత్రం పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108 సమాచారం ఇచ్చారు. ఈమేరకు అంబులెన్సు గ్రామానికి చేరుకొని ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా.. మహబూబ్‌నగర్ సమీపానికి రాగానే పురిటి నొప్పులు అధికం కావడంతో వాహనాన్ని ఆపారు. కొద్దిసేపటికి ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారిద్దరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 108 సేవల పట్ల కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు.

మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ సుష్మ

దేవరకద్ర: గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలు సాగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ సుష్మ హెచ్చరించారు. గురువారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన బెల్టు షాపుల నిర్వాహకులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మద్యం విక్రయాలు చేయరాదని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ధిక్కరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఇతర ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆర్థికసాయం



పాలమూరు: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, సీడ్బీ సంయుక్త ఆధ్వర్యంలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద దివ్యాంగులకు రూ.25వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. గురువారం డీఆర్‌డీఏ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 39 మందికి సాయం అందించారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మి, సీడ్బీ ప్రతినిధి రమేష్, ఎస్‌బీఐ ప్రతినిధి అనిల్, నర్మద, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

చిన్నచింతకుంట: ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సెక్టోరల్ ఆఫీసర్ యశ్వంత్‌రావు, తహసీల్దార్ ఎల్లయ్య అన్నారు. గురువారం కౌకుంట్ల మండలం అప్పంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు చక్రవర్తి గౌడ్ తదితరులు ఉన్నారు.



అప్పంపల్లి పాఠశాలలో అధికారులు

కళాశాలలో అమృత కలశ యాత్ర



అమృత కలశ యాత్ర నిర్వహిస్తున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అమృత కలశ యాత్ర నిర్వహించారు. యాత్రలో భాగంగా విద్యార్థులు పట్టణంలో ఊరేగింపు చేపట్టారు. ఈసందర్భంగా యాత్రలో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ డా. అప్పియా చిన్నమ్మ మాట్లాడారు. అమృత కలశ యాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా. రమాదేవి, సుభాషిణి, సంస్కృత అధ్యాపకులు విఠల్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి

మిడ్జిల్: గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు కష్టపడి పనిచేసి మళ్లీ అధికారంలోకి వచ్చే విధంగా కృషిచేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సూచించారు. గురువారం మండలకేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 18న జడ్చర్లలో నిర్వహించ తలపెట్టిన కేసీఆర్ భారీ బహిరంగ సభకు మండలం నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చే విధంగా చూడాలని అన్నారు. నాయకులు సుదర్శన్, బాలు, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనువాస్‌రెడ్డి, భీమయ్యగౌడ్, శ్రీనువాస్‌గౌడ్, జంగారెడ్డి, బంగారు.నవిన్, భీంరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

నవాబుపేట: బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ పథకాలే బీఆర్ఎస్ గెలుపునకు పునాదులు వేశాయని అన్నారు. 14న మండల కేంద్రంలో అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం ఉంటుందని జయప్రదం చేయాలని కోరారు. అలాగే 18న జడ్చర్లలో ముఖ్యమంత్రి సభకు తరలి రావాలని కోరారు. ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సీఎంసభ జయప్రదం చేద్దాం



జడ్చర్ల టౌన్: పట్టణంలో ఈనెల 18న నిర్వహించే ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగసభను జయప్రదం చేద్దామని జెడ్పీవైస్‌చైర్మన్ యాదయ్య పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఎక్వాయపల్లి, పెద్ద ఆదిరాల, చిన్న ఆదిరాల, కొండేడ్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులు, గ్రామస్తులను కలిసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ సభకు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ ఇంతియాజ్, నాయకుడు శంకర్, రవి పాల్గొన్నారు.

మూడోసారి విజయం ఖాయం

రాజాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మూడోసారి విజయం సాధించడం ఖాయమని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కప్పేరిబచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీశైలయాదవ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరుకానున్నారని వివరించారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం

అడ్డాకుల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన పర్యటించి కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే అక్రమాలు చేసి రూ.కోట్లు వెనకేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలు అమలు చేస్తుందన్నారు. వేణుగోపాల్, టీసీ.శ్రీనివాస్, బాలచందర్‌గౌడ్, మహేష్, షఫిఅహ్మద్, మైనోద్దీన్, నిరంజన్, నవీన్ తదితరులు ఉన్నారు.



అడ్డాకులలో పర్యటిస్తున్న కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్

కాంగ్రెస్‌లో చేరికలు

భూత్పూర్: మండలంలోని తాటిపర్తికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు గురువారం డీసీసీ అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీటీసీ పుల్లయ్య, భూత్పూర్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, తదితరులు ఉన్నారు.

ఏఎంసీగా పవన్‌కుమార్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ) గా జె.పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన మొదట 2011లో హైదరాబాద్ నగరంలోని సీడీఎంఏ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. అనంతరం అక్కడే కొన్నేళ్ల పాటు సీనియర్ అసిస్టెంట్‌గా, సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై పనిచేశారు. ఇటీవలే గ్రేడ్–2 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. కాగా, ఇక్కడి ఏఎంసీ డి.శంకర్‌సింగ్ గత జూలై 18న పదోన్నతిపై రంగారెడ్డి జిల్లా మెప్మా పీడీగా బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటివరకు మేనేజర్ వెంకటేశ్వర రావే ఇన్‌చార్జ్ ఏఎంసీగా వ్యవహరించారు.

తరలివెళ్లిన నాయకులు

గండేడ్: లింగాయత్, లింగ బలిజ రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప బీజేపీలో చేరిక కార్యక్రమానికి మండలానికి చెందిన నాయకులు అధికసంఖ్యలో తరలి వెళ్లారు. ఏపీ రాములు, గిరమోని శ్రీనివాస్, ప్రభునాయక్, బాలయ్య, వీరేంద్రప్ప తదితరులు ఉన్నారు.

చైర్మన్‌గా కావలి వెంకట్‌రాములు

పాలమూరు(హన్వాడ): ఇబ్రాహీంబాద్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్‌గా కావలి వెంకట్‌రాములు ఎన్నికయ్యారు. గురువారం ఇబ్రహీంబాద్ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యవర్గ సభ్యులుగా పాలమూరు వెంకటయ్య, కావలి పుల్లయ్య, ఎర్రవెంకటయ్య, కావలి బాల్‌రాజ్, కావలి అంజిలమ్మ, కావలి మాసమ్మ, జంగంపల్లి చిన్న రామయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ధ్రువపత్రాలు అందజేశారు.



పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

- ముస్తాబవుతున్న మండపాలు
- మట్టి విగ్రహాల ఏర్పాటుకు ఆసక్తి
- జడ్చర్లలో 23న విజయదశమి వేడుకలు

జడ్చర్ల టౌన్: పట్టణంలో ఈనెల 15 నుంచి దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల కోసం అమ్మవారిని ప్రతిష్ఠించేందుకు మండపాలు సిద్ధం చేస్తున్నారు. పర్యావరణ హితమైన అమ్మవారి మట్టి విగ్రహాలకు ఏర్పాటు చేసేందుకు ఉత్సవ కమిటీలు ఆసక్తి చూపుతున్నాయి. ఉత్సవాల కోసం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలోని గర్భగుడిలో అమ్మవారికి ఓ అలంకారం, ప్రాంగణంలో ప్రతిరోజు మరో అవతారంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ప్రతిష్ఠించేలా కార్యక్రమాలు రూపొందించారు. అదేవిధంగా గౌరిశంకర్ కాలనీలో తొలిసారిగా మట్టి విగ్రహం ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ మేరకు మండపాన్ని తీర్చిదిద్దుతున్నారు. కావేరమ్మపేట భవానీ ఆలయం, చావిడి, శ్రీనివాసనగర్, చైతన్యనగర్‌లోని అమ్మవారి ఆలయాలు, హౌజింగ్‌బోర్డు కాలనీ సీతారామాంజనేయస్వామి ఆలయం, విజయనగర్‌కాలనీ అభయాంజనేయస్వామి ఆలయంతోపాటు రాఘవేంద్రస్వామి మఠం సమీపంలో, నిమ్మబావిగడ్డ హనుమాన్ టేకిడి, పాతబజార్ హనుమాన్ దేవాలయం, రాంమందిరంతోపాటు సామిల్స్‌లోనూ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాంమందిరం రాజస్థాన్ ఫంక్షన్‌హాల్‌లో మార్వాడి మహిళా సమితి ఆధ్వర్యంలో దేవిశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా దాండియా, కోలాటాలు ప్రదర్శించనున్నారు. ఇక శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు చండీహోమం నిర్వహించి అమ్మవారికి అలంకరణ చేయనున్నారు. 9రోజుల పాటు అన్నదానం చేయనున్నట్లు ఆచార్య కృష్ణస్వామి తెలియజేశారు.



గౌరీశంకర్ కాలనీలో మండపం ఏర్పాట్లు

23న విజయదశమి వేడుకలు

జడ్చర్లలో ఈనెల 23న సోమవారం విజయదశమి వేడుకలు నిర్వహించాలని తీర్మానించారు. శమీపూజ నిర్వహించేందుకు గానూ శ్రవణ నక్షత్రం, దశమి తిథి సోమవారం సాయంత్రం ఉండటం వల్ల అదేరోజున వేడుకలు నిర్వహించాలని ఉత్సవ కమిటీలు పేర్కొన్నాయి.

ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఒక్కోచోట ఒక్కో అలంకరణలో పూజించనున్నారు. అధికశాతం మండపాల్లో 15న స్వర్ణాలంకృత దుర్గాదేవి, శైలపుత్రి దేవి అలంకారాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 16న శ్రీ బాల త్రిపుర సుందరి దేవి, చంద్రఘంటాదేవి, 17న గాయత్రీ దేవి, స్కంధమాతదేవి, 18న శ్రీలలితాత్రిపురా సుందరి దేవి, అన్నపూర్ణదేవి, 19న అన్నపూర్ణదేవి, లలితాదేవి, 20న అన్ని మండపాల్లో మహా సరస్వతిదేవి అలంకారంలో అమ్మవారిని పూజించనున్నారు. ఇక 21న అన్ని మండపాల్లోనూ మహాలక్ష్మీదేవిగా, ఎనిమిదవరోజు మహిషాసుర మర్దినిదేవీగా పూజించనున్నారు. 23న వాసవీ మాత, రాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారిని పూజించనున్నారు. కొన్ని మండపాల్లో 23న సాయంత్రం శ్రవణ నక్షత్రంలో శమిపూజ నిర్వహించుకుని 24న బుధవారం ఉదయం దశమి వేడుకలు నిర్వహించనున్నారు.